క్లుప్తంగా

ఏపీఈఏపీ సెట్ ప్రారంభం



పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలో ఏపీఈఏపీ సెట్ పరీక్షలు(ఇంజనీరింగ్ స్ట్రీమ్) స్థానిక కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ప్రారంభమయ్యాయి. జేఎన్‌టీయూ కాకినాడ ఆధ్వర్యంలో టీసీఎస్ సాంకేతిక సహకారంతో ఈ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 200 మంది విద్యార్థులకుగాను 195 మంది హాజరయ్యారు. ప్రిన్సిపాల్, కేంద్ర నోడల్ అధికారి పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా సాధన చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, తల్లులు

మార్కాపురం: మార్కాపురం మండలం గజ్జలకొండ సెక్టార్ పరిధిలోని రాయవరం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం యోగా డే నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఆర్.నాగేంద్రరెడ్డి యోగా ప్రాధాన్యతను తల్లులు, చిన్నారులకు వివరించారు. రోజూ గంట సేపు యోగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



క్విజ్ పోటీలు నిర్వహిస్తున్న గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి

బేస్తవారిపేట: స్థానిక గ్రంథాలయంలో బుధవారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు సైన్స్ క్విజ్ పోటీలు నిర్వహించారు. స్పోకెన్ ఇంగ్లిష్, కథలు చెప్పడం, వినిపించడంతోపాటు ఇంగ్లిష్ గ్రామర్‌పై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయుడు గురుస్వామి పాల్గొన్నారు.

విద్యార్థులు సమయాన్ని వృథా చేయొద్దు



విద్యార్థులకు స్నేక్‌చార్ట్‌లు అందజేస్తున్న దాత

గిద్దలూరు రూరల్: విద్యార్థులు తమ అమూల్యమైన సమయాన్ని వృథా చేయరాదని విశ్రాంత ఉపాధ్యాయుడు డి.వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సృజనాత్మకత, నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు ప్రయత్నించాలని సూచించారు. గ్రంథాలయంలో పుస్తక పఠనం విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు దోహదపడుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు విశ్రాంత గ్రంథపాలకుడు ఎం.జయరాంరెడ్డి స్నేక్ చార్ట్‌లు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, రిటైర్డ్ హెచ్‌ఎం రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుక్కెడు నీటికి కటకట!



సీతానాగులవరం గ్రామంలో పనిచేయని డీప్ బోర్లు

- బోర్ల మరమ్మతులు నిల్.. ప్రజలకు అవస్థలు ఫుల్
- ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల తీరుతో ప్రజలకు నీటి కష్టాలు
- కొన్నిచోట్ల అవసరం లేకున్నా నీటి ట్యాంకర్ల కేటాయింపు

తర్లుపాడు:

మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. నీటి వనరులు ఉన్నప్పటికీ డీప్ బోర్లకు మరమ్మతులు నిర్వహించకుండా అధికారులు అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తుండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. తర్లుపాడు మండలంలోని సీతానాగులవరం, పోతలపాడు గ్రామాల్లో డీప్ బోర్లు మరమ్మతులకు గురయ్యాయి. సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానిక ప్రజా ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. ప్రజలతోపాటు పశువుల దాహార్తి తీర్చేందుకు సైతం నీరు దొరకని పరిస్థితి. దీంతో చాలా మంది రైతులు తమ పశువులను మేపలేక తక్కువ ధరకు తెగనమ్ముకుంటున్నారు.

నీటి ట్యాంకులపైనే ఆసక్తి

పలు గ్రామాల్లో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ డీప్ బోర్లు బాగుచేయించకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నీటి ట్యాంకర్లు తిప్పడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో స్థానిక సర్పంచ్‌లు జల్‌జీవన్ మిషన్ ద్వారా కుళాయిలు ఏర్పాటు చేసి ఇంటింటికీ నీటి సరఫరా చేస్తున్నారు. దీనికి తోడు గత నెల రోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తుండటంతో భూగర్భ జలాలు సైతం పెరిగాయి. అవసరం లేకపోయినా అధికార పార్టీ నాయకులకు గ్రామాల్లో నీటి ట్యాంక్‌లు కేటాయించడంతో స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ధనాన్ని టీడీపీ నాయకులకు దోచిపెట్టేందుకే అధికారులు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా గత శనివారం తర్లుపాడులో నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల తీరును సభ్యులు ప్రశ్నించారు. వెంటనే మరమ్మతులు చేయిస్తామంటూ హామీ ఇచ్చినప్పటికీ ఆ దిశగా చర్యలు ప్రారంభించకపోవడాన్ని సర్పంచ్‌లు తప్పుబడుతున్నారు.

ప్రభుత్వ నిధుల దుర్వినియోగం

గ్రామంలో గత కొన్ని రోజులుగా 42 ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నీరు ఎక్కడ.. ఎవరికి.. ఎప్పుడు.. సరఫరా చేస్తున్నారో అంతుపట్టడం లేదు. గ్రామంలో జల్‌జీవన్ మిషన్ ద్వారా గతంలోనే పైపులైను వేసి నీటిని సరఫరా చేస్తున్నాం. నీటి సమస్య లేదు. అధికారులు చొరవచూపి ప్రభుత్వ నిధులను దుర్వినియోగం కాకుండా అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించాలి.

– కుందురు వెంకట సుబ్బులు, సర్పంచ్, చెన్నారెడ్డిపల్లి

మూడు బోర్లు పనిచేయడం లేదు

గత రెండు నెలలుగా గ్రామంలో మూడు డీప్‌బోర్లు పనిచేయడం లేదు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ స్పందించడం లేదు. గ్రామానికి వచ్చి పరిశీలించి నీటి సమస్య పరిష్కరించాలని కోరినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గ్రామ ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు.

– ఆంజనేయులు, సర్పంచ్, సీతానాగులవరం

నిర్లక్ష్యం సరికాదు

గ్రామంలో నీటి సమస్య ఉండటంతో అప్పు చేసి మరీ డీప్ బోరుకు మోటారు బిగించా. గత డిసెంబర్ నుంచి ఎంబుక్ చేయకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఫోన్ చేస్తే స్పందించడం లేదు. కార్యాలయానికి వెళ్తే అందుబాటులో ఉండటం లేదు. అధికారులు నిధులు మంజూరు చేసినట్లయితే మరికొన్ని బోర్లకు మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకొస్తాం.

– శ్రీనివాసరెడ్డి, సర్పంచ్, పోతలపాడు

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి



గొట్లగట్టులో పూజలు చేస్తున్న వేద పండితుడు

గిద్దలూరు రూరల్: హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని రేడియాబావి సమీపంలో గల అభయాంజనేయస్వామి ఆలయంలో బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు సామూహికంగా పాల్గొని లక్ష తమలపాకుల పూజ చేశారు. విజయవాడకు చెందిన కళాకారులతో భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతోపాటు అల్పాహారం అందజేశారు. గురువారం హనుమాన్ శోభాయాత్రను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కొనకనమిట్ల మండలంలో..

కొనకనమిట్ల: హనుమాన్ జయంత్యుత్సవాలను మండలంలోని గొట్లగట్టులో అభయవీరాంజనేయస్వామి ఆలయంలో బుధవారం ఘనంగా ప్రారంభించారు. వేదపండితుడు వినుపాముల రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు చేశారు. గురువారం ఆకుపూజ, హోమాలు, గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేటి నుంచి ఉత్సవాలు..

మండలంలోని పలు గ్రామాల్లో హనుమాన్ జయంతి ఉత్సవాలను రెండు రోజులపాటు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. గొట్లగట్టు గ్రామంలోని అభయ వీరాంజనేయస్వామి, కొనకనమిట్ల రామదూత క్షేత్రంలో పంచముఖ ఆంజనేయస్వామి, నాయుడుపేట, పాతపాడు, గరిమినపెంట, చినమనగుండం, సిద్ధవరం, మల్రిపాలెం గ్రామాల్లోని వీరాంజనేయస్వామి ఆలయాలల్లో వేడుకలు నిర్వహిస్తున్నారు.

నగదు రహితంగా ఆస్తి పన్ను వసూలు



పంచాయతీ కార్యదర్శులతో సమీక్షిస్తున్న డీఎల్‌పీఓ భాస్కర్‌రెడ్డి

కొమరోలు: ప్రజల నుంచి ఆస్తి పన్నును నగదు రహితంగా వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శులను మార్కాపురం డీఎల్‌పీఓ మల్లవరపు భాస్కర్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం కొమరోలు గ్రామ సచివాలయాన్ని డీఎల్‌పీఓ తనిఖీ చేశారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించి గ్రామాలవారీగా ఇంటి పన్ను వసూలు, పారిశుధ్యం, నీటి సమస్యలు తెలుసుకున్నారు. డీఎల్‌పీఓ మాట్లాడుతూ.. ఇంటి పన్ను నగదు రూపంలో చెల్లించవద్దని, స్వర్ణ పంచాయతీ యాప్ ద్వారా మాత్రమే చెల్లించాలని ప్రజలకు సూచించారు. మండలంలో ఈ ఏడాది 67 శాతం ఇంటి పన్ను వసూలైనట్లు తెలిపారు. బాదినేనిపల్లె, ఇడమకల్లు, ముక్తాపురం, పుల్లారెడ్డిపల్లె, రెడ్డిచెర్ల, సూరవారిపల్లి గ్రామ పంచాయతీల్లో నూరు శాతం ఇంటి పన్ను చెల్లించారని వెల్లడించారు. గ్రామ పంచాయతీల్లో 250 కుటుంబాలకు ఒక గ్రీన్ అంబాసిడర్‌ను నియమించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. పారిశుధ్య సమస్య, నీటి సమస్య ఎక్కడ ఉన్నా పంచాయతీ కార్యదర్శులే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఈఓపీఆర్డీ బ్రహ్మయ్య పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి మధుర ఫలం



విక్రయానికి సిద్ధంగా ఉన్న ఉలవపాడు మామిడి పండ్లు

మార్కాపురం: ఉలవపాడు మామిడి పండ్లకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఏర్పడింది. నాణ్యమైన కాయలు, చెట్టుపై మాగిన కాయలంటూ వ్యాపారులు తమ ప్రచారంతో హోరెత్తిస్తున్నారు. రుచిలో దేశవిదేశాల్లో సైతం పేరొందిన ఉలవపాడు భంగినపల్లి మామిడి పండ్లు ఇప్పుడిప్పుడే మార్కెట్‌లోకి వస్తున్నాయి. మార్కాపురం పండ్ల మార్కెట్‌కు నూజివీడు, నంద్యాల, అనంతపురం, గుంటూరు, ఒంగోలు నుంచి మామిడికాయలు వస్తున్నాయి. రకాన్ని బట్టి కిలో రూ.70 నుంచి రూ.100 విక్రయిస్తుండగా, ఉలవపాడు మామిడి పండ్లను మాత్రం రూ.100కు విక్రయిస్తున్నారు. ధర ఎక్కువైనప్పటికీ ఉలవపాడు మామిడి పండ్లను ప్రజలు ఇష్టపడి కొనుగోలు చేస్తున్నారు.



కొమరోలు గ్రామ సచివాలయం–1 వద్ద వేచి ఉన్న తల్లులు

ఏడవొద్దు కన్నా.. ఇంకొంచెం సేపే నాన్నా..

- పసిపిల్లలతో ఆధార్ కేంద్రం వద్ద గంటల తరబడి తల్లుల పడిగాపులు
- కొమరోలులో ఒకే కేంద్రం కావడంతో ఇబ్బందులు

కొమరోలు: మండల కేంద్రమైన కొమరోలులో ఆధార్ నమోదు కేంద్రంలో గంటల తరబడి వేచి ఉండలేక తల్లులు అవస్థలు పడుతున్నారు. గ్రామ సచివాలయం–1లో ఏర్పాటు చేసిన కేంద్రంలో నూతన ఆధార్ నమోదు కోసం భారీగా అర్జీలు వస్తున్నాయి. గతంలో కొమరోలు–1, తాటిచెర్ల గ్రామ సచివాలయాల్లో ప్రభుత్వం ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో ప్రజలు అసౌకర్యానికి గురికాలేదు. ప్రస్తుతం తాటిచెర్ల గ్రామ సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ సెలవుపై వెళ్లడంతో సమస్య తలెత్తింది. ఇదిలా ఉండగా సర్వర్ తరచూ మొరాయిస్తుండటంతో ఆధార్ వెబ్‌సైట్ నిలిచిపోతోంది. రోజుకు 40 మంది వరకు సేవలందించాల్సి ఉండగా 25 మందికి ఆధార్ నమోదు చేయడం గగనంగా మారిందని డిజిటల్ అసిస్టెంట్ పేర్కొన్నారు. మరోవైపు చంటి పిల్లలతో సచివాలయం వద్ద గంటల తరబడి వేచి ఉండలేకపోతున్నామని, మరో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని తల్లులు కోరుతున్నారు.

ఘనంగా సీతారాముల పట్టాభిషేకం



సీతారామ పట్టాభిషేకంలో పాల్గొన్న ఉభయధాతలు

కొనకనమిట్ల: స్థానిక రామదూత క్షేత్రంలో బుధవారం సీతారాముల పట్టాభిషేకం, పూర్ణాహుతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. గత ఏడు రోజులుగా రామదూత క్షేత్రంలో ద్వాదశ శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. వేద పండితుడు అకలంకం వెంకటరామ కృష్ణాచార్యులు, పురోహితుడు డి.అరుణాచార్యులు ముందుగా హోమాలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. కల్యాణ ఉభయదాతలుగా మండంలోని చినమనగుండం, పాదిలికి చెందిన గొంట్లా కుటుంబ సభ్యులు వ్యవహరించారు. పట్టాభిషేకం అనంతరం భక్తులకు అన్న సంతర్పణ చేశారు. గురువారంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ నిర్వాహకుడు యక్కంటి తిరుపతిరెడ్డి తెలిపారు.

రోడ్లు ఆగమాగం.. అడుగేస్తే ఒళ్లు హూనం

- దారుణంగా తయారైన గ్రామీణ రహదారులు
- ఐదు నెలల క్రితం హడావుడి చేసి వదిలేసిన వైనం

కొనకనమిట్ల: డ్రమ్ము తారు పోయలేదు కానీ ఇదిగిదిగో రోడ్లు బాగైపోతున్నాయంటూ అవే రోడ్లెక్కి రంకెలేశారు కూటమి నాయకులు. ఐదు నెలల క్రితం.. అంటే సంక్రాంతికి ముందు కూటమి నాయకులు చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. సీన్ కట్ చేస్తే.. రోడ్లన్నీ గోతులమయంగా దర్శనమిస్తున్నాయి. కొనకనమిట్ల మండలంలోని గొట్లగట్టు నుంచి నాయుడుపేట ఎస్సీ కాలనీ వరకు 3 కిలోమీటర్ల మేర తారు రోడ్డు, వాగుమడుగు నుంచి గనివానిపాడు వెళ్లే రోడ్డు, ఒంగోలు–గిద్దలూరు రహదారిలో బచ్చలకూరపాడు నుంచి తాడివారిపల్లి వరకు ఆర్‌అండ్‌బీ రహదారి అడుగడుగునా గుంతలతో అధ్వానంగా మారాయి. దీంతో వాహనదారులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. గనివానిపాడు రహదారి మధ్యలో చప్టాలు కోతకు గురై ప్రమాదకరంగా ఉన్నాయి. ఇప్పటికైనా పాలకులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.







గొట్లగట్టు నుంచి నాయుడుపేట ఎస్సీ కాలనీ వెళ్లే రోడ్డు పరిస్థితి

ఆ కార్యాలయానికి వెళ్లే దారేది?

- రెవెన్యూ కార్యాలయం ఎదుట తటాకం
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిలిచిన వర్షం నీరు

దర్శి (కురిచేడు): నియోజకవర్గ కేంద్రం దర్శిలో రెవెన్యూ, పోలీస్, ట్రెజరీ, సబ్‌జైలు కార్యాలయాల సముదాయంలోని ప్రాంగణం చిన్నపాటి వర్షానికి తటాకంలా మారుతుండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. బుధవారం సాయంత్రం కురిసిన చిన్నపాటి వర్షానికి ప్రాంగణమంతా నీటితో చేరి తటాకాలుగా మారాయి. బురద నీటి నుంచి కార్యాలయాలకు వెళ్తే కార్యాలయం అంతా బురదమయం అవుతుందని, సిబ్బంది ప్రజలను బయటే ఉంచుతున్నారని, కార్యాలయానికి వెళ్లకుండా, అధికారులకు సమస్యలు చెప్పకుండా ఎలా ఉండాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నగర పాలక సంస్థ అధికారులు వర్షాకాలం కారణంగా ముందస్తు చర్యల్లో భాగంగా లోతట్టు ప్రాంతాల్లో మెరక తోలి నీటి నిల్వలు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. నీటి నిల్వలతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉందని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే కార్యాలయాల సముదాయంలో నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పీహెచ్‌సీ, హెల్త్ సెంటర్లు తనిఖీ

అర్థవీడు: మండల కేంద్రమైన అర్థవీడు, యాచవరం, నాగులవరం, కాకర్లలో హెల్త్ సెంటర్లను బుధవారం సాయంత్రం డీఎంహెచ్‌ఓ టి.వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. ఓపీ రికార్డులు పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. అర్థవీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అత్యవసర పరిస్థితుల్లో వినియోగించేందుకు ఆక్సిజన్ ఏర్పాటు చేస్తామని డీఎంహెచ్‌ఓ తెలిపారు. తాగునీటి కొరత లేకుండా చూస్తామన్నారు.